

# సూర్య

www.suryaa.com

ఏలూరు జిల్లా
పశ్చిమ గోదావరి జిల్లా

బుధవారం,8 అక్టోబర్ 2025

8 పేజీలు


# అధ్యక్ష పదవి ఎప్పుడు?

- కొలిక్కిరాని టిడిపి జిల్లా కమిటీలు - ఛాన్స్ సీనియర్‌లకా ? - జూనియర్‌లకా ?
- సమతూకం కోసమే జాప్యం అంటూ ప్రచారం !

**ఏలూరు,సూర్యప్రతినిధి :** తెలుగుదేశం జిల్లా కమిటీలు ఆ పార్టీ సీనియర్లను ఇంకా ఊరిస్తూనే ఉన్నాయి. వివిధ జిల్లాల నడుమ సామాజిక సమతుల్యం కుదరక పోవడం వల్లే విధాన ప్రకటన లో జాప్యం జరుగుతుందని సమాచారం. గత నెల నాల్గవ వారం లోనే జిల్లాల వారీగా అభిప్రాయలు సేకరించారు. సీనియర్‌ల తో పాటు జూనియర్ లు పెద్ద ఎత్తున పోటీకి దిగారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి బీసీ నాయకులు మాకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు.

**- ఎవెరెవరు ఎక్కడ ? -** పార్టీ జిల్లా అధ్యక్ష పదవి అంటే ఇంతకుముందు పార్టీ నాయకత్వం కనుసన్నలో నియామకం జరిగేది.ఐదేళ్ల జగన్ జమానాలో జిల్లాల్లో నాయకత్వం నడపడానికి ముందుకు రావడమే గగనమయింది.ఇలాంటి తరుణంలో ఏలూరు నుంచి మాజీ ఎమ్మెల్యే గన్ని

- తరువాయి 2లో..

## కొండ దిగవద్దని గిరిజనులకు ఆంక్షలు పెట్టవద్దు

- 26 ఇళ్ల నిర్మాణ పనులు నెల రోజుల్లో పూర్తిచేయాలి
- జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు హుస్సేన్,జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి






**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్ :** గిరిజన ప్రాంతాలలో పీఎం జన్ మన్ పథకం కింద విద్యా,వైద్యం, విద్యుత్, త్రాగునీరు,రహదారులు వంటి మౌలిక సదుపాయాలు మరింతమెరుగుపడేలా అధికారులుచర్యలు తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కోటరామచంద్రపురం ఐటిడిఏ సమావేశపుహాలులోమంగళవారం గిరిజన ప్రాంతాల లో వివిధ అభివృద్ధి, సంక్షేమపథకాల అమలును జిల్లా కలెక్టర్ కెవెట్రిసెల్వితో కలిసి హుస్సేన్ మంగళవారం సమీక్షించారు.ఈసందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో విద్యుత్, రహదారులు , త్రాగునీరు అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలిగించకుండాఅధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటిస్తూనే అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కొండ ప్రాంతాలలో గిరిజనులు కదలికలపైఆంక్షలుపెట్టవద్దని, కొంత మంది అధికారులు తమను కొండదిగవద్దు, అడవిలో సంచరించవద్దని ఆంక్షలు పెడుతున్నారని గిరిజనులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గిరిజన అటవీ ప్రాంతంలో గిరిజనులకు మంజూరు చేసి నిబంధనల పేరుతో నిలుపుదల చేసిన 26 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించి నెలరోజులలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. తమ సమస్యలను తెలియజేసేందుకు వచ్చిన గిరిజనులపట్ల మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు.మన తల్లితండ్రులువారి పనిమీద ప్రభుత్వ కార్యాలయాలకు వెళితే వారు నిరాదరణకు గురైనప్పుడు మనం ఏవిధంగా బాధపడతామో అలోచించాలని మన కార్యాలయానికి వచ్చిన వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని తెలియజేశారు. లంకలపాకల ఆశ్రమ పాఠశాలలో వసతులు మెరుగుపరచాలని అధికారులను

- తరువాయి 2లో..

## నిబంధనలకు విరుద్ధంగా దీపావళి టపాసులు అమ్మితే చర్యలు

- మందు గుండు సామాగ్రి అమ్మకానికి పిల్లలను,బాల కార్మికులను వినియోగించొద్దు
- జిల్లా కలెక్టర్ నాగరాణి,జిల్లా ఎస్‌పి నయీం అస్మి ,జేసి రాహుల్ కుమార్

**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లాలో దీపావళి టపాసులు తయారీ,అమ్మకాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా

- తరువాయి 2లో..



## చెత్త వేయొద్దంటూ స్థానికుల బైఠాయింపు

- పోలీసులు - ప్రజల మధ్య తోపులాట
- వెనక్కు వెళ్లిన చెత్త ట్రాక్టర్లు
- భారీగా పోలీసులు మోహరింపు





**నరసాపురం,మేజర్‌న్యూస్:** స్థానిక 28వవార్డులోని తుంగపాటి చెరువుగట్టు సమీపంలో పట్టణంలో వచ్చే రోజువారి చెత్తను వేసేందుకు పోలీసుల బందోబస్తు మధ్య మంగళవారం మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. గత నెల 27వ తేదీ మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కౌన్సిలర్ లు అడిదల శ్యామల, జిల్లెల్ల దిలీప్ కుమార్, కన్న తదితరులు ఈ ప్రాంతంలో చెత్త వేయటానికి వీలు లేదని సుదీర్ఘ వాదన చేశారు. గతంలో మున్సిపల్ నిధులతో వేముల దీవి, మండ వారి గురువులలో డంపింగ్ యార్డ్ నిర్వహణకు స్థలాలు కొన్నారు.అక్కడి ప్రజలు తిరస్కరించడంతో

- తరువాయి 2లో..





## తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలు సీజ్

- సబ్ స్పెక్టర్ వి.క్రాంతికుమార్ వెల్లడి

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** నిశి రాత్రిలో గుట్టు చప్పుడు కాకుండా తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా ఇసుకను లారీలలో తరలిస్తున్న వారికి జీలుగుమిల్లి పోలీసులుచెక్ పెట్టారు.ఆంధ్రాలో ఆధార్‌కార్డు తెలంగాణలో ఇసుక అమ్మకంతో లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులకు పోలీస్ మార్క్ చూపించారు. ఆంధ్రాలోని కొవ్వూరు నుంచి తెలంగాణలోకి నిత్యం పదుల సంఖ్యలో లారీలలో ఇసుక తరలిస్తున్నారు.ఆసమాచారం అందుకున్న పోలీసులు సోమవారం అర్ధరాత్రి కాపు కాసి ఐదు టిప్పర్ ఇసుక లారీలను జీలుగుమిల్లి సబ్ ఇన్స్పెక్టర్ వి.క్రాంతి కుమార్ అదుపులోకి తీసుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆంధ్ర పర్మిషన్ తో తెలంగాణకు ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం మేరకు గస్తీ నిర్వహించి లారీలను పట్టుకున్నట్లు తెలిపారు. ఇదిలా ఉంటే అక్రమార్కులకు ఉచిత ఇసుక ప్రధాన ఆదాయ వనరుగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. కొవ్వూరు

- తరువాయి 2లో..

## సహనం,ధైర్యంతో పని చేస్తే సత్ఫలితాలు

- శాసన సభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు,ఎమ్మెల్యే బడేటి చంటి





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** అపరిమితమైన విషయ పరిజ్ఞానమే విద్యార్థులను భవిష్యత్తులో తాము ఎంచుకున్న రంగంలో నిష్ణాతులను చేస్తోందని ఏపి శాసన సభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు సూచించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో మంగళవారం కెఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యూచర్ లీడర్స్ మీట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో అటుపోట్లు చూశామని,తద్వారా పోరాట పటిమను నేర్చుకున్నామన్న ఆయన విద్యార్థులు కూడా చిన్న వయసు నుండే పోరాడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని

- తరువాయి 2లో..

# డ్వాక్రా మహిళలు బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

**- ఆర్థికంగా బలోపేతం కావాలి**
**: జిల్లా కలెక్టర్ నాగరాణి**



**భీమవరం,మేజర్‌న్యూస్** :కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరం నందు మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డిఆర్డిఏ, పశు సంవర్ధక శాఖల సమన్వయ సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ సంవత్సరం యాన్యువల్ క్రెడిట్ ప్లాన్ కింద జిల్లాకు 1,419 యూనిట్లు మంజూరు కావడం జరిగిందని, ఎస్ హెచ్ జి మహిళలు వీటి స్థాపన ద్వారా ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్నారు. పెరటి కోళ్ళు, ఎద్దులు, దూడలు, పాడి గేదెలు, మేకలు పెంపకం యూనిట్లు, మినీ పౌల్ట్రీ ఫారం, గొర్రెల, పొట్టేళ్ల యూనిట్లు నెలకొల్పడం ద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని లబ్ధిదారులను కోరారు. వీటి కొనుగోలుకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.జిల్లాలో పాల దిగుబడి తక్కువగా ఉందని, పాల దిగుబడి పెంచేందుకు మేలు జాతి ఆవులు, గేదెలు, కొనుగోలులో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనిపశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లాలో పశుసంవర్ధకశాఖ ద్వారా పాడి గేదెలు, ఆవులు, కోళ్ళ,గొర్రెలు పెంపకంద్వారా లబ్ధిదారులకు అదనపు ఆదాయం లభిస్తుంది అన్నారు.ఈదిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల న్నారు.ఈ సమావేశంలో డిఆర్‌డిఎ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్,పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎల్.కె.సుధాకర్, జిల్లాపశుసంవర్ధకశాఖఅధికారిజవ్వాది హుస్సేన్, డిపిఎంలు ఎస్.కృష్ణ కుమారి,డి.వెంకటే శ్వరరావు, ఎం.బాలాజీ, జిల్లాలోని అన్ని మండలాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

---

# నిబంధనలకు విరుద్ధంగా దీపావళి టపాసులు అమ్మితే చర్యలు

మొదటిపేజి తరువాయి

నిబంధనల మేరకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు దీపావళి టపాసులు తయారీ, అమ్మకాలకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సంయుక్తంగా వివిధ శాఖల అధికారులతో కన్వర్జెన్సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోని విధంగా నిర్వహించుకోవడానికి అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను చేపట్టాలని ఆదేశించారు.నిబంధనలకు విరుద్ధంగా దీపావళి టపాసులు అమ్మకాలు నిర్వహించే షాపులపై చర్యలు తప్పవు అన్నారు. షాపులలో మందు గుండు సామాగ్రి విక్రయించేందుకు సహాయంగా పిల్లలను,బాల కార్మికులను వినియోగిస్తే నిబంధనల మేరకు చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ నిబంధనల మేరకు దీపావళి టపాసుల షాపులను నిర్వహించాలని, తనిఖీలలో లోటుపాట్లు ఉంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పోలీస్, రెవిన్యూ, అగ్నిమాపక శాఖలు ఉమ్మడి తనిఖీలు ఉంటాయని, చిన్నపిల్లలను టపాసులు విక్రయించే షాపులలో ఎట్టి పరిస్థితుల్లో వినియోగించరాదన్నారు.ఈ సమావేశంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి,అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, దాసి రాజు, ఎస్.బి సిఐ వి వి ఎన్ సత్యనారాయణ, డిపిఓ రామనాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకన లక్ష్మి, ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ జి స్వాతి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్ట్ సిహెచ్ తేజస్వి, భీమవరం సహాయం మున్సిపల్ కమిషనర్ రాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ వై.వి జానకిరామ్, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ వి.వి.నాగరాజరావు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్, తదితరులు పాల్గొన్నారు.

---

# సహనం,ధైర్యంతో పని చేస్తే సత్ఫలితాలు

మొదటిపేజి తరువాయి

హితవు పలికారు. ఓపిక, సహనంతో చేసే ఏ పనైనా సత్ఫలితాన్ని ఇస్తోందని, దానికి కాస్తంత ధైర్యాన్ని జోడిస్తేనే గెలుపు సునాయాసంగా లభిస్తుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ భావితరాలకు ఆదర్శప్రాయమైన ఆలోచనలను ఆవిష్కృతపరిచే విధంగా యువత ముందుకెళ్ళాలని, అవిశ్రాంతంగా తమ ఆకాంక్షల సాధన కోసం నిరంతరం పాటుపడాలని హితవు పలికారు. సినిమాల్లో ట్రిబుల్ ఆర్‌కు ఎంత క్రేజ్ ఉందో,అసెంబ్లీ డిప్యూటి స్పీకర్ ట్రిబుల్ ఆర్‌కు అంతే క్రేజ్ ఉందంటూ వ్యాఖ్యానించారు. రేపటి తరానికి,భావి సమాజానికి నేటి యువత ఆలోచనలెంతో కీలకమని పేర్కొన్న ఎమ్మెల్యే చంటి వయసుతో పాటూ ఆలోచనా స్థాయిని కూడా పెంపొందించుకోవాలని సూచించారు.అభివృద్ధిని విస్తృతం చేసే ఆలోచనలకు అడ్డుకట్టే లేదంటూ తనలోని హితోభిలాషను వ్యక్తం చేసిన ఎమ్మెల్యే స్ఫూర్తిదాయకమైనవిధానాలు,స్పష్టమైన ప్రణాళికలతో విద్యార్థులు ముందుకెళ్ళాలని స్పష్టం చేశారు .కార్యక్రమంలో కెఎల్ యూనివర్సిటి డైరెక్టర్ జె. శ్రీనివాస్, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎజిఎం వివి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

---

# అధ్యక్ష పదవి ఎప్పుడు?

మొదటిపేజి తరువాయి

ఆంజనేయులు ముందు కు రావడమే కాకుండా దాదాపు ఆరెళ్ల పాటు సమర్థ వంతంగా భాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు ఆయన స్థానం లో వేరొకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. అభిప్రాయ సేకరణలో పలువురు పోటీ పడ్డారు.ఒకవేళ గన్నికి మరోసారి అవకాశం లేకుంటే తమకు ఇవ్వాలని అభ్యర్థించారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి,చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, టీడీపీ అధికార ప్రతినిధి శ్యామ్ చంద్ర శేషు,సీనియర్‌నాయకులు జయ్యవరపు శ్రీరామ్మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, పెనుమర్తి రాంకుమార్,అట్లూరి రమేష్,కొక్కిరిగడ్డ జయరాజు, దాసరి ఆంజనేయి లు తదితరులంతా జిల్లా అధ్యక్ష రేసులో ఉన్నారు.ఈసారి జిల్లా అధ్యక్ష పదవి ఓసీలకు కాకపోతే బీసీ లేదా కాపు లకు కేటాయిస్తారని విస్తృత ప్రచారం. జిల్లా పరిశీలకులు మాత్రం ఐదుగురు పేర్లని ఆదినాయకత్వంకి ప్రతి పాదించినట్టు సమాచారం. **- పశ్చిమలో పోటా పోటీ -**పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా ఇప్పటికే జిల్లా నాయకత్వం కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఈ జిల్లా నుంచి ఇప్పటికే అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ఉన్నారు. ఆయనను మార్చాల్సి వస్తే అనేక మంది ఆ పదవి ఆశిస్తున్నారు.పశ్చిమలో ఉన్న రాజకీయ పరిణామల నేపథ్యంలో కాపు లేదా క్షత్రియలకే ఎక్కువ అవకాశం. మంతెన రామరాజుతో సహ జిల్లా నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరావు,పేర్లను పరిశీలన లోకి తీసుకున్నారు.మంత్రి నిమ్మల రామానాయుడు, ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు,తోట సీతారామలక్ష్మి,పితాని సత్య నారాయణ వంటి వారి సలహాలని పరిగణలో కి తీసుకొంటారని భావిస్తున్నారు.

**- ఈ టెన్షన్ భరించలేం -**జిల్లా కమిటీల ప్రకటనలో జరుగుతున్న జాప్యం ఒక ఎత్తయితే ఈ ఉత్కంట భరించలేమంటూ ఆశవాహులు ఇప్పటికే వాపోతున్నారు. జిల్లా కమిటీ నియామక ప్రక్రియ ఆరభించి చాలా కాలమైంది. ఇప్పటివరకు ఎవరంతట వారు ఏమి జరుగుతుందో తెలుసు కోవడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. మంత్రులు,ఎమ్మెల్యేలను కొందరు ఆరా తీశారు. కొన్ని జిల్లాలకు సంభందించి ప్రతిష్టంభన కారణం గా జిల్లా అధ్యక్షుల జాబితా పెండింగ్ లో పడినట్టు విశ్వసనీయ సమాచారం.

---

# కొండ దిగవద్దని గిరిజనులకు ఆంక్షలు పెట్టవద్దు

మొదటిపేజి తరువాయి

ఆదేశించారు. మోదెలా పరిసర గ్రామాలకు విద్యుత్ సౌకర్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.గిరిజన గ్రామాలన్నింటి లో కమ్యూనికేషన్ నెట్వర్క్ మెరుగుపడేలా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పెదవాగు ప్రాజెక్ట్ కు మరమ్మత్తు పనులు జరిగేలా తెలంగాణా రాష్ట్రంలో చర్చించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కు భూములు అందించిన రైతులకు పునరావాస ప్యాకేజి త్వరితగతిన అందించాలాన్నారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా భూమికి భూమి పథకంలో సేకరించిన భూమిని వెంటనే సంబంధిత రైతులకు అందించాలన్నారు.గిరిజన ప్రాంతాలలో గిరిజన, గిరిజనేతరుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాలలోని ఆసుపత్రులలో మరింత మెరుగైన వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్ట్ మరమ్మత్తు పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి, తెలంగాణా ఇరిగేషన్ అధికారులకు ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే చర్యలు చేపడతామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజిఅందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి జి.సతీష్,జలగం ప్రసాదరావు, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి రాములు నాయక్, జంగారెడ్డిగూడెం ఇంచార్జ్ ఆర్డీఓ ఎం. ముక్కంటి,పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణల ప్రత్యేక కలెక్టర్ సరళా వందనం,ట్రాన్స్కో ఎస్ఈ సాల్మన్ రాజు, డిఎంహెచ్ఓ డా పి.జె.అమృతం, గృహనిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ,తహసీల్దార్లు,వివిధశాఖలఅధికారులు పాల్గొన్నారు.

# చెత్త వేయొద్దంటూ స్థానికుల బైఠాయింపు

మొదటిపేజి తరువాయి

28వ వార్డులో చెత్తను వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇక్కడ కూడా వ్యతిరేకత వచ్చింది. జనావాసాల మధ్య ముఖ్యంగా దళితులు జీ వించే చోట చెత్తను ఎలా వేస్తారు అని ప్రశ్నించారు. ఇదే విషయమై సబ్ కలెక్టర్, మున్సిపల్ కార్యాలయాల దగ్గర ధర్నాలు కూడా చేశారు.గత నెలలో జరిగిన మున్సిపల్ సమావేశంలో ఈ విషయంపై అధికారులు సమాధానం చెప్పాలని, ఇక్కడ చెత్త వేయడానికి వీలు లేదని వాదించారు. చైర్ పర్సన్ హామీ ఇవ్వాలని పట్టుపట్టారు. దీంతో చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ ఈ ప్రాంతంలో చెత్త వేయరని హామీ ఇచ్చారు. సమస్య సర్దుమనిగింది. తాజాగా పోలీసు బందోబస్తు మధ్య చెత్త ట్రాక్టర్లను మున్సిపల్ డి ఈ ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. యధావిధిగా స్థానికులు నిరసన తెలిపారు. రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు వీరిని బలవంతంగా అక్కడ నుండి తొలగించేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు, స్థానికుల మధ్య తోపులాట జరిగింది.

ఇది ఇలా ఉండగా 26వ వార్డు కౌన్సిలర్ జిల్లెల్ల దిలీప్ కుమార్ అధికారులు, పోలీసులతో వాదానికి దిగారు. మున్సిపల్ చైర్ పర్సన్ కౌన్సిల్ సమావేశంలో హామీ ఇచ్చారని, ఇక్కడ చెత్త ఎవరు వేయమన్నారు అని వాదించారు. చైర్ పర్సన్ తో ఫోన్లో సంప్రదించగా ఈ విషయం తనకు తెలియదని చెప్పడంతో చైర్ పర్సన్ కు కూడా చెప్పకుండా చెత్త ఎలా వేస్తారు అని ప్రశ్నించారు. చాలాసేపు పోలీసులు, స్థానికుల మధ్య వాగ్వివాదంజరగడంతో ట్రాక్టర్లను వెనక్కు తీసుకువెళ్లారు. దీంతో సమస్య తాత్కాలికంగా పరిష్కారం అయ్యింది.

# తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలు సీజ్

మొదటిపేజి తరువాయి

నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లాలంటే సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది దారి పొడవునా చెక్పోస్టులు ఉన్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో అక్రమార్కులు నిత్యం ఇసుకను తరలిస్తూ కోట్లు గడిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.లారీలపై 'ఆన్ డ్యూటీ ఎన్ హెచ్' అని స్టిక్కర్ అంటించుకుని మరి ఇసుకను దోచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.దీనికి అడ్డుకట్ట వేయాలంటే ఆంధ్రా నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను తరలించకుండా సరిహద్దు ప్రాంతాలలో విజిలెన్స్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని వలువురు కోరుతున్నారు.

# సమస్యలు పరిష్కరించండి : ఎంపీపీ రామారావుకు వినతి



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్** గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు దుస్థితి మరీ అధ్వానంగా ఉన్నాయని రైతులు తమ పొలాలలోకి వెళ్ళుటకు మార్గం లేకపోవడంతో ఇబ్బందులకు గురి అవుతున్నామని గవరవరం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ రాజ్ కుమార్ ఎంపిపి గంజిమాల రామారావుకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొయ్యలగూడెం మండలం పరిధిలో ఉన్న చొప్ప రామన్నగూడెం గ్రామంలో నుండి పుంత రోడ్డు మార్గం ద్వారా పొలాలకు వెళ్లే రహదారులు ,చుట్టుప్రక్కల గ్రామాలైన పొంగుటూరు గ్రామం వెళ్లే రహదారి భారీ గుంతల పడి కనీసం మోటర్ సైకిల్ పై వెళ్లాలన్న గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు. పొలాల నుండి పండించిన పంటను నివాసాలకు తెచ్చుకొనుటకు, లేదా యూరియా వంటి ఎరువులను పొలాలకు తీసుకు వెళ్ళుటకు కూడా మార్గం లేకపోవడం తో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు.గ్రామంలో ఎవరైనా చనిపోయిన వారిని స్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించుటకు వెళ్లే మార్గం గోతులు పడే అసలే కురుస్తున్న వర్షాలకు నీరు రహదారిపై. నిలిచి పోవడంతో నడుచుకొని వెళ్ళుటకు మార్గంలేక ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గంజిమాల రామారావుకు గ్రామస్తులతో వినతి పత్రాన్ని అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ త్వరలో సమస్యను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు.

# రామన్నపాలెంలో సూపర్ జిఎస్టి పై అవగాహన కార్యక్రమం



**మొగల్తూరు,మేజర్ న్యూస్ :** మండలం లోని రామన్నపాలెం,(జెట్టిపాలెం) గ్రామంలో నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వేంకటేశ్వర కిరాణా అండ్ జనరల్ స్టోర్స్తో పాటు పరిసర ప్రాంతంలోని పలు షాపులను సందర్శించారు. గత ప్రభుత్వ కాలంలో ఉన్న ధరలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0 విధానం తర్వాత వస్తువులు లభిస్తున్న ధరలతో పోల్చి ప్రజలకు వివరించారు. కొత్త జీఎస్టీ విధానం అమలుతో నిత్యావసర సరుకుల ధరలు తగ్గి, సాధారణ ప్రజల జీవనంలో ఊరట కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ జీఎస్టీ 2.0 ద్వారా అందుతున్న లాభాలను తెలుసుకుని వినియోగించుకోవాలని, అలాగే ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, మొగల్తూరు మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, రామన్నపాలెం టీడీపీ అధ్యక్షులు కట్టా నాగూర్, మామిడిశెట్టి సత్యనారాయణ,బొల్లా నారాయణ విఠల్, కుక్కల రవి, గుబ్బల సత్యన్నారాయణ, పాల రాంబాబు,కడలి విశ్వేశ్వరరావు,అడపా కొండలరావు, కొల్లాటి భోగరాజు, పి యంఏ రాజు, ధనవర్ధన, తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేటీకరణ వద్దు - ప్రభుత్వ పరమే ముద్దు



పాలకొల్లు,మేజర్ న్యూస్: దగ్గులూరు మెడికల్ కళాశాలను ప్రైవేటు కరణ చేయడం దారుణం అని వైఎస్ఆర్సిపి పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీర మల్లికార్జున అన్నారు, జగన్ మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తలపెడితే విజనరీ అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు పేద విద్యార్థులను పొట్టకొట్టి ఆ మెడికల్ కాలేజీ లను ప్రైవేటు కరణ చేయడం దారుణం అన్నారు,జగన్ మోహన్ రెడ్డి పేద మధ్య తరగతి విద్యార్థులు వైద్య చదువులు చదివేందుకు ముందు తరాలకు బాటలు వేస్తుంటే చంద్రబాబు నాయుడు ఆ బాటలను తూటులు పొడుస్తున్నారు,ఆ మాత్రం 8 వేలు కోట్లు చేసి ఆ మెడికల్ కాలేజీ లను ప్రభుత్వం నిర్వహించలేదా ?

ఆ మెడికల్ కాలేజీ లు పూర్తి అయితే జగన్ మోహన్ రెడ్డి పేరు వచ్చేస్తుందని,ఈ కాలేజీ లను తమ పెత్తందారులు కట్టబెట్టడం చంద్రబాబు నాయుడు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని వీర మల్లికార్జున్ అన్నారు,

# బస్ స్టాండ్, పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానస్పద కార్యకలాపాలను అరికట్టాలనే లక్ష్యంతో పోలీసు శాఖ మంగళవారం జంగారెడ్డిగూడెంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలను జంగారెడ్డిగూడెం డిఎస్పి యు.రవిచంద్ర ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు,పరిసర ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు నిర్వహించారు. ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్, ఎస్ ఐ ఎస్.కె జబీర్ ప్రత్యేకంగా డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రధానంగా బస్టాండ్‌తో పాటు పరిసర ముఖ్య ప్రాంతాలలో ఈ తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌ను ఉపయోగించి బస్టాండ్ లోని ప్రయాణికుల లగేజీలు, పార్సిల్ ప్రాంతాలు,అనుమానస్పద వ్యక్తులను క్షుణ్ణంగా పరిశీలించారు.

ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రజలతో భద్రతా భావాన్ని పెంపొందించటం,నేరాల నివారణకు రవాణా కేంద్రాలలో జరగటానికి అవకాశం ఉన్న అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాల రవాణా దొంగతనాలు నివారించడానికి చర్యలు చేపట్టారు.పోలీస్ సిబ్బందిని ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంచటం, డాగ్ స్క్వాడ్ ను సమర్థవంతంగా వినియోగించు కోవడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా పోలీసు ఉన్నతాధికారుల మార్గ దర్శకత్వంతో నిర్వహించిన ఈ తనిఖీలు శాంతి భద్రత పర్యవేక్షణకు రద్దీ ప్రాంతాలలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్ తెలిపారు

# పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలకు స్వచ్ఛ ఆంధ్ర పురస్కారం



**ఏలూరు,మేజర్ న్యూస్ :** దొండపాడు నందు గల పరివర్తన్ దివ్యాంగుల పాఠశాల కు స్వచ్ఛఆంధ్ర పురస్కారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,జిల్లాపరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ,మేయర్ నూర్జహాన్ ద్వారా అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 2014, ఈ నెల 2న భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో స్వచ్ఛ భారత్‌కు శ్రీకారం చుట్టారు. అదే స్ఫూర్తితో ముందుకు వెళు న్నాము.స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.అదే స్ఫూర్తిగా పరివర్తన్ సంస్థ గత 28 సంవత్సరముల నుండి దివ్యాంగులకు సేవలు అందిస్తున్నదని అన్నారు.ఈ అవార్డు ఇచ్చినందుకు జిల్లా కలెక్టర్‌కి,విభిన్న ప్రతిభావంతులు,వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.

# చెరుకు గడల అలంకరణలో శ్రీ అభయాంజనేయ స్వామి దర్శనం




**పెనుమంట్ర,మేజర్ న్యూస్ :** మార్టేరు జెడ్ వంతెన దగ్గర శ్రీ ఆంజనేయ స్వామి గుడిలో ఆంజనేయ స్వామికి ఎంతో ప్రీతి పాతికమైన మంగళవారం స్వామి వారిని చెరుకు గడలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.అర్చకులు విజయ గోపాలచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యుల్లో ఒకరైన కర్రీ అచ్చుత రామారెడ్డి మాట్లాడుతూ ప్రతి మంగళవారం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్నారని, ఈ అలంకరణకు సహకరిస్తున్న భక్తులకు కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. భక్తులుకు పతి మంగళవారం రుచికరమైన ప్రసాదం అందజేస్తున్నారు.

# రైతు రక్షణ కోసమే రైతు సంఘం కృషి



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** రైతు రక్షణ వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృషి చేస్తోందని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక యుటిఎఫ్ భవనం హాలులో ఈనెల 30,31వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 23వ మహాసభ నిర్వహణ కమిటీ సమావేశం మంగళవారం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు అధ్యక్షతన జరిగింది. అనంతరం రైతు సంఘం జిల్లా మహాసభ కరపత్రాలను జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు మనుగడ కోసం రైతు ఉద్యమమే మార్గం అన్నారు.వ్యవసాయం సంక్షోభంలో ఉందని, రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెంలో జరగనున్న ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుండి 250 మంది రైతు ప్రతినిధులు, రైతు సంఘం రాష్ట్ర,జిల్లా నాయకులు హాజరుకాను న్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరిబత్తుల సీతారామయ్య,నాయకులు పసల సూర్యారావు,అనపర్తి వెంకటేశ్వర రావు,బోడిక రామచంద్రరావు,గోలి నర్సిరెడ్డి,మాండ్రు సూర్యచంద్రం,అల్లూరి వెంకట రామరాజు,పలువురు రైతులు పాల్గొన్నారు.

# వైభవంగా వాల్మీకి మహర్షి జయంతి,గోదావరి హారతి





పెనుగొండ, మేజర్ న్యూస్: లోక కళ్యాణానికై మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుని జీవిత గాథను ప్రపంచానికి ఆదికావ్యంగా అందించిన ఆదికవి వాల్మీకి మహర్షియని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రేణుక పేర్కొన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలోని గోదావరి పుష్కర రేవు వద్ద ఆశ్వియుజ పూర్ణిమ సందర్భంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గోదావరి హారతి ,వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత నిట్టల సతీష్, లక్ష్మీదేవి దంపతులచే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ముళ్ళపూడి రేణుక మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై జీవించే సంస్కృతి మనదని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా జల వనరులను కాపాడు కోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యంగా భావించడం కోసమే మన పూర్వీకుల నుండి నదీమ తల్లులను ఆరాధించడమనేది సాంప్రదాయంగా మారిందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వికసిత భారత కన్వీనర్ సుబ్రహ్మణ్యం, గోదావరి విభాగ్ గ్రామ వికాస్ సంయోజక్ చింతాకుల గోపాలకృష్ణ, బిజెపి మండల అధ్యక్షులు దొడ్డిపట్ల నాగూరు,హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అంగవైకల్యంతో బాధపడుతున్న బాలికకు ఎమ్మెల్యే బొలిశెట్టి సాయం



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లి గూడెం రూరల్ మండలం కమ్మగూడెం గ్రామానికి చెందిన చేబ్రోలు సాయి నవ్య పోలియో కారణంగా ఇబ్బంది పడుతున్నారు. పార్టీ నాయకులు నుండి సమాచారం తెలుసు కున్న కుటుంబ సభ్యులకు 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. అంగవైకల్యానికి సంబంధించిన శస్త్ర చికిత్స నిమిత్తం తిరుపతి బిఐఆర్ఆర్ డి ఆసుపత్రి డైరెక్టర్‌తో మాట్లాడి ఆమె నవ్యకు అవసరమైన శస్త్ర చికిత్సను అందించాలని ఫోన్లో మాట్లాడారు. నవ్య సాయి వాళ్ళ కుటుంబ సభ్యుల సహాయంతో బొలిశెట్టి శ్రీనివాసు ను కలిసిన సందర్భంలో వారి కుటుంబానికి ధైర్యం చెప్పి ఆర్థిక సహాయం అందించారు.

## దేవుని సువార్త సభలను విజయవంతం చేయండి



కొయ్యలగూడెం రూరల్ .మేజర్ న్యూస్ : ఈనెల 9,10,11 తేదీలలో కొయ్యలగూడెం పట్టణంలో క్రీస్తు సంఘం చర్చ్ సంఘ కాపరి బొగ్గవరపు బాబురావు ఆధ్వర్యంలో దేవుని సువార్త సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు రోజులు జరిగే సభలు సాయంత్రం 7 గంటల నుండి ప్రారంభం అవుతాయని విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని రాజ్య సువార్త ద్వారా మారుమనసు పొందాలని తెలిపారు. ప్రసంగికులు పి.డీ.డీ.బిషప్ మండపేట.పి నాగభూషణం (పాస్టర్), జంగారెడ్డిగూడెం వి.మోజెస్ (పాస్టర్) ధర్మాజీ గూడెం గ్రామాల నుండి విచ్చేయుచున్నారని, ప్రజలు విశ్వాసులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## వివిధ అంశాలపై కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ



**నరసాపురం రూరల్,మేజర్ న్యూస్:** గ్రామీణ ప్రాంతంలో సుస్థిర అభివృద్ధి, శానిటేషన్, పారిశుధ్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు దృష్టి సారించాలని ఎంపీపీ మైలాబత్తుల సోనీ, ఎంపీడీవో వీరభద్ర రావులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా కార్యక్రమం ను వీరు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేశారు. అనంతరం మొగల్తూరు, నరసాపురం మండలాల్లోని గ్రామ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణను ఇచ్చారు. పేదరిక నిర్మూలన, ప్రజారోగ్యం, శానిటేషన్ తదితర ఎనిమిది అంశాలపై అవగాహన కల్పించారు. బుధవారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పంచాయతీల విస్తరణ అధికారి నాగేంద్ర కుమార్, పలువురు సర్పంచులు మాట్లాడారు.

# ఉత్తమ విద్యార్థులకు సర్పంచ్ అనిత ఏసుపాదం సహాయం



**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** మండల పరిధి ఈదర గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సర్పంచ్ దొండపాటి అనిత ఏసుపాదం ఈదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తటుకులూరి మేఘన,వికృతి జ్యోతి,యర్రంశెట్టి అమృత,వింజమూరి స్మైలీ ఇంటర్ మీడియట్ ఉత్తమ ఫలితాలు సాధించి, విజయవాడ ప్రగతి కాలేజీలో ఉచితంగా సీటు సాధించినందుకు వారిని సత్కరించి ఒక్కొక్కరికి 10వేల రూపాయలు చొప్పున నలుగురుకీ రూ.40వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ప్రభుత్వ పాఠశాల పరిస్థితులు చాలా దయనీయ పరిస్థితిలో ఉండేవని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు రాష్ట్ర ప్రభుత్వం,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్వహించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడిపి అధ్యక్షుడు నక్కన బోయిన వేణు,ఈదర పిఎసిఎస్ చైర్మన్ కోటగిరి మోహన్ బాబు,శోభనాపురం పిఎసిఎస్ చైర్మన్ నలజాల హరిబాబు ,గ్రామ టీడీపీ పార్టీ అధ్యక్షుడు గరిశేపల్లి శ్రీనివాసరావు,స్కూల్ చైర్మన్ కంచర్ల అంజయ్య తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ మండల బిజెపి అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుక



**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్ :** వందే వాల్మీకి కోకిలం ధర్మమే జీవన మూలం, న్యాయం క్షమాశీలతతో జీవించాలని సత్యం, ధైర్యం, ఆత్మవిశ్వాసం ఇవే మానవుని ఆభరణాలని అరుల్లకు హాని చేయకపోవడమే గొప్ప పుణ్యం అని రామాయణం ద్వారా ప్రపంచ మానవాళికి మార్గదర్శకంగా చూపి మర్యాద పురుషోత్తముడైన రాముడి రాముడు జీవితం మనందరికీ ఆదర్శనీయమైనదని వాల్మీకి విజ్ఞాన కేంద్రం పాఠశాల పరిపాలనాధికారి తనికెళ్ల సత్య రవికుమార్ పేర్కొన్నారు. రామాయణ సృష్టికర్త ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వంకావారిగూడెం వాల్మీకి విజ్ఞాన కేంద్రం నందు ప్రధానాచార్యులు ఎంవీఎస్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. తొలుత పాఠశాల ప్రాంగణంలోని వాల్మీకి మహర్షి విగ్రహానికి గిరిజన నాయకులు తెల్లం వెంకటేశ్వరరావు,ఊకా సూర్య చంద్రావులు పుష్ప మాలలు వేసి, పూజలు చేసినారు. వాల్మీకి రామాయణ బృందానికి పూజ జరిగింది. ఈ సందర్భంగా రామాయణ శ్లోకాలు పఠించారు. ఈ కార్యక్రమంలో తెల్లం వెంకటేశ్వర రావు,ఊకా సూర్యచంద్రరావు,యు.శివశంకర్,కే గౌరీశ్రీ,వి కామేశ్వరి, పి మహేష్, అమల,లక్ష్మీ, విద్యార్థిని. తన్మయి,హేమ స్కంద వేదుల జనార్ధన్ రావు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను కలిసిన బిజెపి నాయకులు



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** జాతీయ ఎస్టి కమిషన్ చట్టాల పైన గ్రామాలలో అవగాహన కల్పించాలని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జే హుస్సేన్ నాయక్ బిజెపి శ్రేణులకు పిలుపునిచ్చారు. కొయ్యలగూడెం లో బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్ నివాసానికి విచ్చేసిన జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జె. హుస్సేన్ నాయక్ ను జీలుగుమిల్లి భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను శాల్వాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు కొండపల్లి దుర్గాప్రసాద్, చాట్రాతి ప్రసాద్, పులగం సుబ్బారెడ్డి, బొరగం వెంకటలక్ష్మి, బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, ఉకే సూర్యసంద్రం, బొంతు రామకృష్ణ,శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నిష్ణాతులైన సీనియర్ సిటిజన్‌లకు సన్మానం



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్స వం వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఈనెల 8వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అధ్యక్షులు కుప్పాల కోటేశ్వరరావు మంగళవారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ పాల్గొంటున్నారని తెలిపారు. చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి,జడ్పిటిసి పోల్నాటి బాబ్జి,ఆర్డీవో ఎం.ముక్కంటితో సహా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు కూటమి నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలోని నిష్ణాతులైన సీనియర్ సిటిజనులకు సన్మానాలు, 100 మంది ఎంపికైన పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ జరుగుతుందని కోటేశ్వరరావు తెలిపారు.

# పెదవాగు ప్రాజెక్టు గండి నిర్మాణం పూర్తి చేయాలి



– పోలవరం నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ఇవ్వాలి

**బుట్టాయిగూడెం,మేజర్న్యూస్ :** పెదవాగు ప్రాజెక్టు గండి నిర్మాణం పూర్తి చేయాలని, పోలవరం నిర్వాసితులందరికి ఆర్ అండ్ ఆర్ ఇవ్వాలని సిపిఐ యం యల్ ప్రజా పంథా ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కెగౌస్ కోరారు. సిపిఐ యం యల్ ప్రజా పంథా ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోట రామచంద్రాపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కి మంగళవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజా పందా కార్యదర్శి ఎస్ కే గౌస్ మాట్లాడుతూ 2022 గోదావరి వరదలను బట్టి మండలాన్ని యూనిట్ గా చేసుకొని ఆర్ అండ్ ఆర్ వర్తింపజేయాలని కోరారు. మేడేపల్లి నుండి వసంత వాడ వరకు పెదవాగు పరీవాహక గ్రామాల్లో త్రీ ఫేస్ కరెంట్ లైన్ వేసి మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు.రామవరం, నార్లవరం గ్రామ పంచాయతీల ఎర్ర గోడ, గుండ్ల మడుగు గ్రామాల్లోని కాలనీలో తాగు నీరు, రోడ్డు, కరెంట్,సమస్యలు పరిష్కరించాలని అన్నారు. అల్లూరి నగర్ పంప్ హౌస్ లో వృధాగా ఉన్న నీటిని లిఫ్ట్ ద్వారా మేడేపల్లి, రామవరం గ్రామ పంచాయతీ గ్రామాల భూములకు సాగు నీరు ఇవ్వాలని కోరారు. పోలవరం ముంపు యువతకు ఆర్, అండ్ ఆర్ వర్తించే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీ ఓ అమలు చేయాలని తెలిపారు. అనేక సంవత్సరాలుగా సాగుచేస్తున్న పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలని అధికారులను కోరారు. గుండ్ల మడుగు గ్రామానికి మంచినీరు, రోడ్డు, కరెంట్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గద్దల ముత్యాల రావు, పోలవరం డివిజన్ పార్టీ కార్యదర్శి కట్టం ముత్యాల రావు, తుర్రం తమ్మయ్య, జిల్లా కార్యదర్శులు మున్ని, తుర్రం నవీన్, మిరియాల సీతారాముడు,కట్టం అర్జున్, పాయం వెంకయ్య, కలుముల దుర్గా రావు తదితరులు పాల్గొన్నారు.

## దొంగలు రాకుండా లక్కవరంలో వినూత్న గస్తి

– విజిల్స్ మోగిస్తూ వ్యాపారస్తులు,పోలీసులు రాత్రి వేళ పహారా



**జంగారెడ్డిగూడెం మేజర్ న్యూస్** మండలంలోని లక్కవరం పోలీస్ స్టేషన్ గ్రామంలో అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 3 గంటల వరకు పోలీసులుతో పాటు విజిల్స్ ఎగాగిస్తూ వ్యాపారస్తులు రాత్రులు గస్తే నిర్వహిస్తున్నారు. ఇటీవల లక్కవరంలో జరిగిన భారీ దొంగతనం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని వ్యాపారస్తులు చెబుతున్నారు. గ్రామస్తులు దొంగలకు భయం పుట్టేలా విజిల్స్ మోగిస్తూ గ్రామంలో నైట్ బీట్ నిర్వహిస్తున్న పోలీసులను లక్కవరం వ్యాపారస్తులు సహకారం అందిస్తున్నారు తమ గ్రామం తమ బాధ్యతగా వ్యాపారస్తులు దొంగలకు భయం పుట్టించేలా నిర్ణయం తీసుకొని రోజుకి ఆరుగురు గ్రామంలో పర్యటించేలా సోమవారం రాత్రి నిర్ణయం తీసుకొని ప్రారంభించారు. ఇది ఇలా ఉండగా లక్కవరం వ్యాపారస్తులు ప్రజలు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవలసి ఉంది. త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు కూడా జరుగుతుంది అని తెలుస్తుంది.

## అన్న సమారాధన ప్రారంభించిన ఎమ్మెల్యే బడేటి



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక 1వ డివిజన్ కోడెలు హమాలీ కాలనీలో అమ్మవారి గుడి వద్ద అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈడా చైర్మన్ పెద్ది బోయిన శివప్రసాద్,అగ్రికల్చర్ కోపరేటివ్ సొసైటీ బ్యాంక్ చైర్మన్ అమరావతి అశోక్, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం,సెక్రటరీ రెడ్డి నాగరాజు,టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతిరావు,1వ డివిజన్ కో ఇన్చార్జ్ గరికపూడి చంటిబాబు,ఆలయ కమిటీ సభ్యులు మాదుగుల చిన్నబ్బాయి,కోన శ్రీనివాసరావు, నాగులపల్లి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభ్యుదయమే మా ధ్యేయం : ఎమ్మెల్యే బొలిశెట్టి






**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** గ్రామ అభ్యుదయమే మా ధ్యేయంగా పయనిస్తున్నామని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం వద్ద తాడేపల్లిగూడెం,నల్లజర్ల మండలాల సర్పంచ్లు,కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సర్పంచ్లు ప్రజలు వారికిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గ్రామాల అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సర్పంచ్ పదవి కాలం చివరి రోజుల్లో శిక్షణ ఎందుకని ఎవరు భావించవద్దని రానున్న రోజుల్లో కూడా గ్రామ అభివృద్ధికి ఒక పౌరుడిగా మీ భాగస్వామ్యం అవసరం అవుతుందని దానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలు కట్టే పన్నుల తోటే జీతాలు తీసుకుంటున్నామని భావనతో పని చేయాలని ప్రజల సేవకులుగా వ్యవహరించాలని సూచించారు. డ్వామా ఏపిడి జీవీకే మల్లికార్జునరావు మాట్లాడుతూ ఇటు పంచాయతీ నిధులు మరోపక్క ఉపాధి హామీ నిధులతో గ్రామాభివృద్ధి సాధించవచ్చు అని తెలిపారు. జడ్పిటిసి ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజా సేవకు కట్టుబడి పని చేసే నాయకుడు పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మన నాయకులు కావడం మన అదృష్టమని వారికి ఏ విషయం నైనా అండగా ఉండాలని కోరారు. ఎంపీడీవో వి చంద్రశేఖర్ మాట్లాడుతూ సర్పంచులు కార్యదర్శులు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు.

## సిఎం సహాయ నిధి చెక్కులు అందజేసిన విప్ నాయకర్



**మొగల్తూరు, మేజర్ న్యూస్ :** మండలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, బొమ్మిడి నాయకర్ ఇళ్లకు స్వయంగా వెళ్లి మొత్తం రూ. 11,86,440విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంగళ వారం లబ్ధిదారులకు అందజేశారు. కాళీపట్నం ఈస్ట్, కాళీపట్నం వెస్ట్, ముత్యాలపల్లి, కొత్తోట, తదితర గ్రామాలకు చెందిన వారికి చెక్కులు అందించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అంకితభావం తో పనిచేస్తోందని బొమ్మిడి నాయకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నరసాపురం నియోజకవర్గంలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు జనసైనికులు పాల్గొన్నారు.

## జనవాణిలో దరఖాస్తులు స్వీకరించిన ఎమ్మెల్యే బాలరాజు



**మంగళగిరి / జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో శాసన సభ్యులు చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యలతో కూడి న వినతులు ఎమ్మెల్యే బాలరాజుకి అందజేశారు. ప్రజలు ఇచ్చిన అర్జీలను శ్రద్ధగా స్వీకరించి ఎమ్మెల్యే బాలరాజు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కల్పించేందుకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి నగర జనసేన అధ్యక్షుడు వై. శ్రీనివాస్, వీరమహిళ ప్రాంతీయ కో ఆర్డినేటర్ కిరణ్ ప్రసాద్, లీగల్ సెల్ ప్రతినిధి బి. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ పరీక్షలు.




**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్ :** పేరిచర్ల ఫౌండేషన్, డైమండ్స్ లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తి దాయకం అని ఉచిత వైద్య శిబిరంలో షుగర్ వ్యాధి ని నియంత్రణ కై ప్రతి నెల ఉచిత షుగర్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని నరసాపురం జిల్లా బిజెపి మీడియా కోఆర్డినేటర్ నరిసే సోమేశ్వర అన్నారు. స్థానిక ఆర్ అండ్ బి గ్రౌండ్స్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కు ప్రతినెలా పేరిచర్ల ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఉచిత బ్లడ్ టెస్ట్ లు ఫౌండేషన్ డైరెక్టర్ లయన్ చిలువూరి శ్యాం కుమార్ రాజు సహకారంతో నిర్వహించారు. నత్తి శివ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ పేరిచర్ల ఫౌండేషన్ లాంటి స్వచ్ఛందసంస్థ లు నిర్వహిస్తున్న క్యాంప్స్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈసందర్భంగా డైమండ్స్ క్లబ్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని వయసుల వారిని పట్టి పీడిస్తున్న మహమ్మారి షుగర్ వ్యాధి అని మధుమేహ నియంత్రణ అందరూ పాటించాలని ప్రతినెలా వాకర్స్ కు లయన్స్ కు సీనియర్ సిటీ జన్స్ కు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో లయన్స్ చెన్నా రెడ్డి సతీష్, అపర్ణ గ్రంధి ప్రసాద్ డీఎస్పీ ముఖర్జీ, మానేపల్లి కిరణ్, గాజుల మురళీకృష్ణ, యర్రా ఆంజనేయ స్వామి దాసరి వెంకటేశ్వర రావు బాబురావు. జె.డి.ఐ ఈశ్వర్. అచ్చిబాబు. రెడ్డి సత్యనారాయణ, యెలిశెట్టి ప్రసాద్మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# 11,12 తేదీల్లో ఛాంబార్ కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు




**పాలకొల్లు,మేజర్ న్యూస్** : ఈనెల 11,12 తేదీల్లో పాలకొల్లు ఛాంబార్ కళాశాల స్వర్ణోత్సవ సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహ రావు చెప్పారు. సోమవారం కళాశాల ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. రెండున్నర కోట్ల ఖర్చుతో నిర్మించిన సముదాయానికి మంత్రి నారా లోకేష్, నెంబర్ రామాంజనే యులు కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మలు ప్రారంభిస్తారని తెలిపారు, ఇంకా ఎన్ని గేర్ రచయిత అండ్ శ్రీరామ్ కులపతి ప్రొఫెసర్ ఎస్ ప్రసన్న పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తామని గతంలో వింటారు డిగ్రీ పీజీ విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు లు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఈనెల 8న పట్నంలో బాబా యాత్ర నిర్వహిస్తారని యాత్రలో ఛాంబర్ కళాశాల విద్యార్థులు యాజమాన్య సభ్యులు అధ్యాపక ఆధ్యాత్మిక సిబ్బంది ఉత్సవ శోభాయాత్రలో పాల్గొని బ్రహ్మోత్స వేడుకలు ఘనంగా నిర్వహిస్తారాన్నారు. ఇంకా ఛాంబర్ కార్యదర్శి కటారి నాగేంద్ర కుమార్ అధ్యక్షులు దేవరపల్లి లక్ష్మీనారాయణ ప్రిన్సిపాల్ డాక్టర్ బి వెంకటేశ్వర్ రావు మొత్తం గణేష్ నాసర్ ప్రిన్సిపాల్ కార్మూరి అకాడమిక్ అడ్వైజర్లు డాక్టర్ నందుల సీతారామారావు పాల్గొన్నారు.

## మద్ది ఆంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్** : మండలంలోని గుర్వాయిగూడెంలో శ్రీ మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి ఈరోజున వివిధ సేవల రూపేనా రు.2,07,725 లు ఆదాయం వచ్చింది. ఈనెల 8వ తేదీ ఉదయం 8 గంటల నుండి స్వామివారి హుండీలను తెరిచి ,లెక్కించటం జరుగుతుందని ఆలయ సహాయ కమిషనర్ కార్యనిర్వహణాధికారిణి ఆర్. వి. చందన తెలిపారు.

## వెనుకబడిన విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధ చూపాలి



**పోడూరు,మేజర్ న్యూస్**: అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధ తీసుకోవాలని పోడూరు మండల విద్యాశాఖాధికారి-2 జీ. వి. సూర్యనారాయణ అన్నారు. పాఠశాలల సాధారణ సందర్శనలో భాగంగా మంగళవారం చింతలగరువులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలని ఆకస్మికంగా సందర్శించారు. తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన తీరును, విద్యార్థుల హాజరుని, పాఠశాల మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థుల పట్ల మరింత శ్రద్ధ చూపాలని, నూరుశాతం విద్యార్థుల హాజరుకి కృషి చేయాలని,ప్రతి రోజూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొల్లాబత్తుల సూర్య కుమార్, ఉపాధ్యాయుడు మట్టా నాగరాజు పాల్గొన్నారు.

## బయ్యనగూడెంలో ఘనంగా వాల్మీకి జయంతి



**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్** : బయ్యనగూడెం గ్రామంలో పెద్ద రామాలయం వద్ద వెంకటేశ్వర భజన సమాజం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. మండల టిడిపి అధ్యక్షులు పారేపల్లి నరేష్ , జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి మద్దతేజ, ఆరేటి ఏసుబాబు ప్రముఖులు వాల్మీకి జీవిత చరిత్రను వివరించారు.

స్థానిక పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు వెంకటేశ్వర భజన బృందం వారి సహకారంతో పెన్నులను పంపిణీ చేశారు .వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు,వెంకటరామయ్య,కటిక రాధాకృష్ణ , ప్రముఖులు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాటంరెడ్డి సూర్యనారాయణ , తాడి సాయిబాబా, తిరుమల శెట్టి గంగాధర్, కలవగంటి శివ, భోగరాజు రమేష్, కోటపోతుల రామారావు, పలువురు పాల్గొన్నారు.

# వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం




**ఏలూరు,మేజర్న్యూస్**:కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు, మహాపురుషుల వుతారన్న మాటలకు వాల్మీకి మహర్షి జీవితం ఒక ప్రత్యక్ష నిదర్శనం అన్నారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. వాల్మీకి జయంతి సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేసిన ఎంపీ.రామాయణ మహా కావ్యాన్ని రచించిన వ్యక్తిగా ప్రతి హిందువు పూజించాల్సిన మహా ఋషి వాల్మీకి అని, అయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. వేట వృత్తిగా అడవుల్లో బోయవాడిగా జీవిస్తున్న సమయంలో ఒక ప్రాణం తీయడం ఎంత తప్పో తెలుసుకుని ఘోర తపస్సు చేసి, ఋషిగా మారిపోయిన వాల్మీకి చరిత్ర అందరూ తెలుసుకోవాలన్నారు. రామాయణం మహా గ్రంథాన్ని కోట్లాది హిందువులకు కానుకగా ఇచ్చిన ఆ మహనీయునికి ఘన నివాళి అర్పిస్తున్నట్లు తెలిపారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిర్వహిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా బోయ, వాల్మీకి కులస్థుల విజ్ఞప్తి మేరకు యువనేత నారా లోకేష్ గారు హామీ ఇచ్చిన విషయం, అందుకు అనుగుణంగా గత ఏడాది అక్టోబర్ లో ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ఉదయం ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

## వైసిపి సమీక్షలో పాల్గొన్న గురునాధరావు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్**: తాడేపల్లిలోనే వైఎస్ఆర్ సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులతో వైఎస్ఆర్ సీపీ నేత,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జంగారెడ్డిగూడెంనకు చెందిన పార్టీ రాష్ట్ర నాయకులు,మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జెట్టి గురునాధరావు కూడా పాల్గొన్నారు.

## జిల్లా జట్టుకు జల క్రీడల్లో 10 బంగారు,రజిత పతకాలు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్** : జంగారెడ్డిగూడెం ఎర్ర కాలువ వాటర్ స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు కర్నూలులో ఈనెల 4,5తేదీలలో జరిగిన 4వ రాష్ట్ర స్థాయి జల క్రీడలు,డ్రాగన్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. సీనియర్,జూనియర్ విభాగాల్లో 5 బంగారు పతాకాలు,5 వెండి పతాకాలు సాధించారు.

వీరంతా ఏలూరు జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రతిభ కనబరిచారు. 500 మీటర్ల పోటీలో బంగారు పతాకం, 200 మీటర్ల డ్రాగన్ పడవ పోటీల్లో బంగారు పతాకం, కానోయింగ్, కాయకింగ్‌లో 3 బంగారు పతకాలు పొందారు. ఇతర అంశాల్లోను 5 రజిత పతాకాలు అందుకున్నారు. పథకాలు పొందిన ఏలూరు జిల్లా జట్టులో టి.సాయిరాం ,జి.సాయి రాం,భాస్కర్, పరమాత్మ,జాన్, అఖిల్,పవన్, రెహమాన్,లిఖిత్, నిర్మలానాని,కుమార్, వాసు,రాఖి,సంతోష్ ఉన్నారని కోచ్ లు కృష్ణమూర్తి,రాజేష్ తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

## అనాధాశ్రమాలకు,వృద్దులకు గ్లోబల్ సపోర్ట్ వితరణ

**- 22 న జీవన సంధ్య వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు**




**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్** : పడాలలోని జీవన సంధ్య వృద్ధులకు 200 కిలోల బియ్యం, తాడేపల్లిగూడెంలోని లార్డ్ ఆఫ్ లైఫ్ అనాథాశ్రమానికి 150 కిలోల బియ్యం, నిడదవోలులోని లెప్రసీ కాలనీ, నిరాశ్రయులకు 300 కిలోల బియ్యం అందజేశామని గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు చెన్నా త్రికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మద్దతు ఇచ్చినందుకు వాణికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. ఈ నెల 22న జీవన సంధ్య వృద్ధాశ్రమంలో దీపావళి జరుపుకోవాలని మేము లక్ష్యంగా పెట్టుకున్నామని, వృద్ధులతో దీపావళి జరుపుకోవాలనుకునే ఎవరైనా 22 సాయంత్రం జీవన సంధ్య వృద్ధాశ్రమాన్ని సందర్శించవచ్చని వివరించారు. వృద్ధులను జాగ్రత్తగా చూసుకున్నందుకు బ్రహ్మాజీ , కేశవ వర్మ వారి బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని త్రికళ పేర్కొన్నారు. గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవల కొరకు ఈ మొబైల్ : 9133304555 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని అన్నారు.

# అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలి




– జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

**భీమవరం,మేజర్ న్యూస్** : పీజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు మంగళవారం వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గత సంవత్సరం నిర్వహించినటువంటి ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమం నందు ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను జిల్లా కలెక్టర్ అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేపట్టిన ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంలో డిఆర్డిఏలో ఉన్నటువంటి నిరక్షరాశులయిన మహిళలకు చదువు నేర్పించి తర్వాత పరీక్ష రాయించి, ఉత్తీర్ణులైనటువంటి లెర్నర్స్ కి ఆయా మండలాల ఏపిఎంలకు నేడు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మహిళలు చదువుకుంటేనే అన్ని రంగాల్లో రాణించగలరని,నిరక్షరాస్యులుగా ఉన్నవారు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న విద్యను అందిపుచ్చుకుని అక్షరాస్యులు కావాలని సూచించారు.జిల్లా వయోజన విద్యానోడల్ అధికారి కె వి వి సత్యనారాయణ మాట్లాడుతూ గత సంవత్సరం పశ్చిమగోదావరి జిల్లాలో 3,930 మంది డ్వాక్రా గ్రూపులలో మహిళలకు అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించగా వారిలో 3,895 మంది చదువు నేర్చుకుని ఉత్తీర్ణులై సర్టిఫికెట్లను సాధించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఎమ్మెస్ ఎస్ వేణుగోపాల్, డిపిఎంలు, ఏపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# పారా స్పోర్ట్స్ లో 'లంకపల్లి' ప్రతిభ





**ముదినేపల్లి ,మేజర్ న్యూస్** : పారా స్పోర్ట్స్ (పడవల పోటీ)లో లంకపల్లి లక్ష్మీనరసింహారావు(నాని) కాంస్య పతకం సాధించడం పై ఏపీ కయాకింగ్ కనోయింగ్ సంఘం అధ్యక్షులు బి బలరాం నాయుడు , క్రీడాకారులు అభినందించారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వడాలి గ్రామానికి చెందిన లంకపల్లి నాని ఈనెల 4 కర్నూలు జిల్లా కరేయపురం సిటీ ఫారెస్ట్ లేక్ (సరస్సు)లో జరిగిన 4వ ఇంటర్ స్టేట్ కాయాకింగ్ , కానోయింగ్ ఛాంపియన్ షిప్ లో అసాధారణ నైపుణ్యం ప్రదర్శించి కాంస్య పతకాన్ని సాధించాడు. భవిష్యత్తులో ఇలాంటి అనేక విజయాలు సాధించాలని రాష్ట్రస్థాయి , జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అభినందించారు.

# 20 హెచ్‌పి మోటర్లు పనులు పరిశీలించిన కో-ఆప్షన్ సభ్యులు పెదబాబు



**ఏలూరు,మేజర్ న్యూస్** : రాబోయే వేసవికాలంలో ఏలూరు నగర ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడకుండ ముందు జాగ్రత్తగా అమరుస్తున్న 20 హెచ్‌పి మోటర్లు పనులు పరిశీలించామని నగరపాల కసంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ ఎం.ఈ ఈ. సురేంద్రబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ ఇంజనీర్ ఈ. సురేంద్రబాబు,ఎలక్ట్రికల్ డిఈ నారాయణరావుతో కలిసి దెందులూరు సమీపంలో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఎస్ఎంఆర్ పెదబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాలతో రానున్న వేసవికాలంలో నగర ప్రజలకు మంచినీటి కొరత లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామనీ ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య ప్రజల మంచినీటి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించడంతో అప్పటికి ఆ సమస్య పరిష్కారం అయిందన్నారు. కార్పొరేటర్లు జిన్నూరు కనక నరసింహారావు,పాము శామ్యూల్,ఈదుపల్లి పవన్ తదితరులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించామనీ ఎస్ ఎం ఆర్ పెదబాబు తెలిపారు.

# రామాయణ మహా కావ్యం మానవాళికి అందించిన మహర్షి వాల్మీకి



**భీమవరం ,మేజర్ న్యూస్** : రామాయణ మహా కావ్యాన్ని రచించి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి మహర్షి వాల్మీకి అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి,డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ.వి సూరిబాబు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## దొమ్మటి కనక దుర్గకు బెస్ట్ అంగన్వాడీ కేంద్రం అవార్డు



**పెనుమంట్ర,మేజర్ న్యూస్** : కృషి, పట్టుదలతో పెనుమంట్ర సెక్టార్‌లో ఉన్న మూడు ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల నుండి స్థానిక మండలంలోని సోమరాజు ఇల్లింద్ర పర్రు – 1అంగన్వాడీ కేంద్రం కార్యకర్త దొమ్మటి కనక దుర్గ బెస్ట్ అంగన్వాడీ కేంద్రం అవార్డు సాధించారు. ఈ మేరకు సోమవారం రాత్రి జిల్లా కేంద్రం భీమవరంలో జరిగిన అవార్డు ల పంపిణీ వేడుకలో రాష్ట్ర, జిల్లా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి నుండి ఈ అవార్డు అందుకున్నారు. 2002 లో అంగన్వాడీ కార్యకర్తగా చేరి, విధులను సమర్థ వంతంగా నిర్వహిస్తున్న కనక దుర్గ కు అవార్డు రావడం సెక్టార్ కు గర్వకారణమని సెక్టార్ సిడిపిఒ అంగర కృష్ణ కుమారి, సూపర్ వైజర్ పి. వరలక్ష్మి అన్నారు.కనక దుర్గ ను స్ఫూర్తి గా తీసుకొని సెక్టార్ లోని మూడు మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు, సహాయకులు పని చేయాలని వారు కోరారు.

# రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి వాల్మీకి



**ఏలూరు,మేజర్ న్యూస్** : జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొని, మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, మహర్షి వాల్మీకి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ నేడు మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను మన రాష్ట్ర పండుగగా రాష్ట్రం అంతా ఘనంగా జరుపు కుంటున్నారని, రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అని అన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సీతారాములు సద్గుణాలను, గొప్పదనాన్ని చెప్పడంతో పాటు ఆదర్శవంతమైన జీవితం, కుటుంబవిలువలు నుంచి పాలనా సూత్రాలు వరకు నేటితరం నుండి రాబోయే అన్నితరాలు వారికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. కృషి చేస్తే జ్ఞాన సముపార్జన ఎవరికైనా సాధ్యమే అని, అది బోయ వర్గానికి చెందిన మహర్షి వాల్మీకి విషయంలో నిరూపితమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి టి.వెంకటేశ్వర రావు, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, జిల్లా కలెక్టరేటు, బిసి కార్పొరేషన్, వివిధ శాఖలు ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు చోరీ చేయడం దురదృష్టకరం



– ఏపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం

**ఏలూరు, మేజర్ న్యూస్**: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ పాలక్ వర్మ ఓట్లు చోరీ అంశం పై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జె.డి శీలం మాట్లాడుతూ ఓటు భారత పౌరుడికి రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని,అది చోరీ కావటం దురదృష్టం అని అన్నారు. పౌరులను చైతన్య పరచి ,హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పాలక్ వర్మ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలలో ఏవిధంగా ఓటు చోరీ కార్యక్రమం జరిగింది వివరించారు అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు కోఆర్డినేట్ పెద్దిరెడ్డి సుబ్బారావు, ఆయన కార్యకర్తలతో పాల్గొన్నారు, కైకలూరు ఆర్డినేటర్ బొడ్డు నోబుల్, చింతలపూడి కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే ఎలిజా, పోలవరం కో ఆర్డినేటర్ భాస్కరరావు, నూజివీడు కోఆర్డినేటర్ ఆఫీసు బేరర్లు ,దెందులూరు కో ఆర్డినేటర్ ఆలపాటి నరసింహ మూర్తి, వారి వారి కార్యకర్త లతో కలిసి పాల్గొన్నారు, ఏపీసీసీ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కామన ప్రభాకర్, విశ్వంపల్లి సుందరరావు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, ఏపీసీసీ జనరల్ సెక్రటరీ గౌతు సత్యేంద్ర, ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, దండుబోయిన చంద్రశేఖర్, మూర్తి, సేవాదళ్ సుబ్బారావు కొమ్మన సాంబశివరావు, రంభ కిషోర్ యవన నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు అభిమానులు నాయకులు పాల్గొన్నారు అనంతరం సంతకాల సేకరణ చేశారు.

# కొల్లేరు ప్రజలు మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదిక






**– అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ ,పర్యావరణం శాఖ కార్యదర్శి శరవణనన్**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో మంగళవారం కొల్లేరు ప్రాంతం అభివృద్ధి, ప్రజలు సమస్యలు పరిష్కారంపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి, అటవీ, పర్యావరణం శాఖల ప్రత్యేక కార్యదర్శి శరవణనన్ సంబంధిత అధికారులతో సుదీర్ఘంగా 2:40 గంటలు పాటు కొల్లేరు ప్రాంత మండలాలు వారీగా రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్దండే సమీక్షించారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఏలూరు అర్బన్, ఏలూరు రూరల్, భీమడోలు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు,ఉంగుటూరు,కైకలూరు, మండవల్లి, పశ్చిమగోదావరి జిల్లాలో ఆకివీడు మండలం కలిపి మొత్తం ఉమ్మడి జిల్లాలో పదిమండలాలు కొల్లేరు ప్రాంతంఉందనివివరించారు. ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, తీసుకున్న చర్యలు, కొల్లేరు విస్తీర్ణం మ్యాపు ద్వారా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి వివరించారు. ఏపి అప్కాబ్, ఉమ్మడి జిల్లాల చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పైగా అవుతుందని,కొల్లేరు ప్రాంత సమస్యలు తీరి అభివృద్ధికోసం కొల్లేరుప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ మాకు, అటవీశాఖ అధికార్లకు సమన్వయం కొరవడిందని, కనీసం మాకు సమాచారాన్ని కూడా ఇవ్వడం లేదన్నారు.కొమటిలంకకు చాలా సమస్యలు ఉన్నాయని, బ్రిడ్జి నిర్మాణంకు ఇంకా అనుమతులు రాలేదని చెప్పారు.కైకలూరు శాసనసభ్యులు డా.కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కొల్లేరు ప్రాంత అభివృద్ధి చాలామటుకు చేసుకోగలిగామని, మిగిలిన పనులు కూడా పూర్తయ్యేలా చూడాలని కోరారు. బుడమేరు వరదతో కొల్లేరు ప్రాంతం ఒక గ్రామాన్ని కూడా ముప్పు బారిన పడకుండా జిల్లా యంత్రాంగం సహకారంతో చూడగలిగామన్నారు.కొల్లేరు ప్రజలు సమస్యలు ఇంకా ఎక్కువసమయం తీసుకోకుండా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటే కొల్లేరు ప్రజలు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారని అన్నారు.ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ మా నియోజక వర్గంలో ప్రభుత్వ భూముల్లో ఆక్వా చెరువులు లేవని, అంతా క్లియరుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్, ఆయా మండలాలు తహశీదార్లు ,పారెస్టురేంజి అధికారులు పి.మోహినివిజయలక్ష్మి, కె.వి.రామలింగాఆచార్యులు,డిప్యూటీ తహశీదార్లు, సర్వే అధికార్లు, రెవిన్యూ,అటవీశాఖ సూపరిండెంట్లు, తదితరులు పాల్గొన్నారు

# సిఆర్ఆర్ విద్యార్థులకు 'డ్రగ్స్ వద్దు బ్రో ' అవగాహన



ఏలూరు,మేజర్న్యూస్ : సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజ్ ఏలూరు లో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం జిల్లా పోలీస్ ,ఈగల్ టీం సభ్యులు ఈగల్ ఐ.జి.పి ఆకే రవికృష్ణ ఉత్తర్వుల మేరకు, జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు నాయకత్వంలో ఈగల్ టీం ఏలూరు ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో'అవగాహన కార్యక్రమ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాదాపు 1000 మంది విద్యార్థిని, విద్యార్థులు,కళాశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది,ఈగల్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్. సూర్య చంద్రరావు మాట్లాడుతూ గంజాయి వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయి, భవిష్యత్తుపై ప్రతి కూల ప్రభావాలు చూపుతాయి.సరైన స్నేహితు లను ఎంచుకో వడం ముఖ్యమని, మత్తు మిత్ర బృందంలో పడవద్దని తెలిపారు.చదువులో దృష్టి పెట్టి లక్ష్య సాధన చేయాలని విద్యార్థులను ప్రోత్సహిం చారు.డ్రగ్స్ వాడాలనే ఆలోచన వస్తే వెంటనే పెద్దలు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలి.3 టౌన్ సిఐ వి.కోటేశ్వరరావు డ్రగ్స్, సైబర్ క్రైమ్,రోడ్ భద్రత అంశాలపై వివరించారు. ఈగల్ ఆర్ఎస్ ఐ బి.ఉదయ భాస్కర్ గంజాయి మొదలయ్యే ప్రాసెస్,అలవాటు ఊబిలోకి ఎలా పడతారో వివరించారు.చుట్టూ ప్రక్కల ఎవరైనా గంజాయిని గాని మత్తు పదార్థాలనుగాని సేవించిన లేదా అమ్మకాలు జరిపిన వారి వివ రాలను ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972ను విద్యార్థులకు తెలియచేశారు.

# రాష్ట్రస్థాయి త్వైకాండో పోటీలకు ఎంపికైన ప్రతిభ విద్యార్థి హర్షవర్ధన్



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి ప్రతిపాదికన ఎస్ జి ఎఫ్ ఐ త్వైకాండో సెలక్షన్స్ ఇండోర్ స్టేడియం ఏలూరు నందు ఈనెల 6న జరిగాయి. అండర్ 14 బాలుర (38 – 41) బరువు కేటగిరీలో జంగారెడ్డిగూడెం ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న గజ్జవల్లి హర్షవర్ధన్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థి తండ్రి రవి ఈస్ట్ ఎడవల్లి జడ్పీ హైస్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విజేత హర్షవర్ధన్ ఈనెల 11 నుంచి 12 వరకు ఎస్బివిఎం జడ్పీ హెచ్ఎస్ పేటేరు, రేపల్లి మండలం, బాపట్ల జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనటం జరుగుతోంది.ఈ విద్యార్థిని ని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ కాసర సరోజా రెడ్డి ,స్కూల్ డైరెక్టర్ సుభాష్ రెడ్డి, సింధూషా రెడ్డి మంగళవారం అభినందించారు.

# పేరుపాలెం,కెపీ పాలెం బీచ్ సందర్శకుల రక్షణకు చర్యలు

**– చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**





**భీమవరం,మేజర్ న్యూస్ :** కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరం నందు మంగళవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బీచ్ సందర్శకుల రక్షణ ఏర్పాట్లపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి కూడా పాల్గొన్నారు.నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని బీచ్ల సందర్శకులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోకుండా అవసరమైన ముందస్తు చర్యలను సంబంధిత కమిటీ సభ్యులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాద నాగరాణి మాట్లాడుతూ పేరుపాలెం బీచ్ పర్యాటకులకు చాలా ప్రసిద్ధి చెందిందని, వారాంతాల్లో, ప్రభుత్వ సెలవు దినాలలో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారన్నారు. సందర్శకులు అలల లోతు గమనించక పేరుపాలెం బీచ్లో పదేపదే మునిగిపోవడం జరుగుతుందన్నారు. కొంతమంది మద్యం సేవించి బీచ్లో స్నానానికి దిగడం కూడా ఒక కారణంగా ఉందన్నారు. పేరుపాలెం బీచ్లోని స్థానిక లా అండ్ ఆర్డర్ పోలీసులతో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను కూడా నిర్వహించాలన్నారు. మత్స్యకారులు వేటకు వెళుతున్న సందర్భంలో కొంతమంది ఆకతాయి సందర్శకులు మత్స్యకారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు నా దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మత్స్యకారుల జీవనభృతికి ఆకతాయి సందర్శకులు విఘాతం కలిగిస్తే వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి మాట్లాడుతూ మాట్లాడుతూ బీచ్ సందర్శకులు పోలీస్ హెచ్చరికలను తూచా తప్పక పాటించాలని తెలిపారు.మద్యం సేవించి ఎవరు బీచ్ లోనికి వెళ్ళవద్దని సూచించారు. మత్స్యకారులకు ఇబ్బంది కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ సమావేశంలో విశాఖపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ డిఎస్పి జి.బాలిరెడ్డి, అంతర్వేది మెరైన్ ఇన్స్పెక్టర్ నవీన్ నరసింహమూర్తి, కాకినాడ సూపరింటెండెంట్ ఆఫ్ కస్టమ్స్ కే హెచ్ ఎస్ ఆర్ ప్రైన్ కుమార్, మచిలీపట్నం పోర్టు కన్జర్వేటర్ ఆర్.వెంకటేశ్వరరావు, ఫారెస్ట్ రేంజర్ ఎం.కరుణాకర్, ఏలూరు ఇంటెలిజెన్సీ బ్యూరో ఎసిఐఓ–1 వేణు కళ్యాణ్, కాకినాడ ఐసిజిఎస్ దివాకరన్, మత్స్యశాఖ ఏడి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాల పనులపై మంత్రి రామానాయుడు సమీక్ష



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** శ్రీ క్షీర రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు మంగళవారం మంత్రి రామానాయుడు దేవదాయ అధికారులు సమావేశం అయ్యారు, నియోజకవర్గంలో దేవాలయములు 2027 – గోదావరి పుష్కరాలు పనులపై డా.నిమ్మల రామానాయుడుతో ఉప కమీషనర్,దేవదాయ ధర్మదాయ శాఖ డి.ఎల్.వి.రమేష్ బాబు,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాస్, జిల్లా దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి, వి.హరి సూర్య ప్రకాష్ ,అసిస్టెంట్ ఇంజినీర్ ,భీమవరం వి.వెంకటేశ్వర రావు, తనిఖీదారు పాల్గొని చర్చించడం జరిగినది.

## ఏరియా ఆసుపత్రి అభివృద్ధిపై ఎమ్మెల్యే నాయకర్ సమీక్ష



**నరసాపురం ,మేజర్ న్యూస్ :** స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందన్నారు.పేషంట్ల పట్ల మరింత బాధ్యతతో వ్యవహరించాలని, వారికిచ్చే సేవల పరంగా ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అలాగే, ఆసుపత్రిలో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. హాస్పిటల్కి అవసరమైన వైద్య పరికరాలు, శుభ్రత, డ్రింకింగ్ వాటర్, టాయిలెట్లు వంటి వసతులు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మారణ హోమాన్ని నిలుపుదల చేయాలి




**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్:** ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న మానవ మారణ హోమాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.ప్రసాద్ డిమాండ్ చేశారు. పాలస్తీనాలో అమాయక ప్రజలను గత రెండు సంవత్సరాలుగా బాంబులు వేసి చంపేస్తున్న ఇజ్రాయిల్ వైఖరిని ఖండిస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరపాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు బస్టాండ్ సమీపంలో మంగళవారం సభ జరిగింది. జిల్లా నాయకులు ధర్ముల సురేష్ సభకు అధ్యక్షత వహించారు. సభలో రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసాద్ మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. వేలాదిమంది చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రజలందరూ ముక్తకంఠంతో ఈ దాడులను ఖండించాలని పిలుపు నిచ్చారు. సభలో జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ జేఏసీ నాయకులు షేక్ ముస్తఫా, షేక్ నాజీర్, షేక్ అబ్దుల్ షాహి, షేక్ బాజీ (టిప్ టాప్) మహమ్మద్ షహీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దాల ప్రసాద్,తదితరులు ప్రసంగిస్తూ ఇజ్రాయిల్ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. పాలస్తీనా ప్రజలకు అండగా ప్రపంచ దేశాలు ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం వేలాది మందితో భారీ ప్రదర్శన పట్టణంలో జరిగింది.ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.శ్రీనివాస్ కారం రాఘవ, కెవి రమణ ,వెట్టి భారతి, కురసం లత,పోలిరెడ్డి, తగరం బాబురావు, తదితర నాయకులు తో పాటు న్యాయవాదులు ఏసుబాబు,భాషా శ్యాం,షేక్ ఆదిల్ , తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.